

నగర శివారులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలి

### అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 18 : ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను గుర్తించి వెంటనే వాటిని తొలగించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సమీకృత రెసిడెన్సియల్ విద్యాసంస్థలు, వసతిగృహ సముదాయాల నిర్మాణాల కోసం ఆయా ప్రదేశాల్లో అందుబాటులోని ప్రభుత్వ స్థలాలను గుర్తించడానికి కలెక్టర్ మంగళవారం నగర శివారులోని నాగారం, గుండారం ప్రాంతాలను సందర్శించారు. గుండారం గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న క్రమంలో పలు ఆక్రమణలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ గమనించారు. వెంటనే వాటిని తొలగించాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పై రెండు ప్రదేశాల్లోనూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలల నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ బాలరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## పంట ఎండే..



**వేసవికి ముందే ఎండలు** మండుతుండడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో చేతికి వచ్చే దశలో ఉన్న పంటలు ఎండుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి, పంటలు ఎండుతున్నాయి. వేల రూపాయలు అప్పులు తెచ్చి సాగుచేసిన పంట ఎండిపోతుండడం చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. చి'వరి'కి చేసేదేమీలేక పశువులకు మేతగా వాడుతున్నారు. బోర్లు ఎత్తివేయడంతో పంట ఎండి అప్పులు మిగిలాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

– సిరికొండ, ఫిబ్రవరి 18

## రైతు గుండె మండే..!



స్వల్పబండ తండాలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ధర్పల్లి, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పాలనలో రైతులకు రామగోస తప్పడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు అది చేస్తాం..ఇది చేస్తామంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్ప చేసిందేమీలేదని మండిపడ్డారు. రైతు భరోసా రాలేదని, రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని స్వల్పబండ తండాలో మంగళవారం రైతులు పాస్ పుస్తకాలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఇప్పటి వరకు రైతుభరోసా రాలేదని, రైతు రుణమాఫీ కూడా అందరికీ రాలేదని తెలిపారు. తమ సమస్యలను ఏ అధికారి పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే వస్తుందంటూ చెబుతున్నారే తప్ప, ఇంతవరకు వచ్చింది లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు రైతుభరోసా అందించాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు

# పసుపు రైతుల ఆందోళన

నిజామాబాద్ మార్కెట్ యార్డు ముట్టడి



మార్కెట్ కమిటీ సెక్రటరీని నిలదీస్తున్న రైతులు

- కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్
- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై మోసం చేస్తున్నారని ఆగ్రహం
- పేపర్‌లో చూపించడానికే పసుపు బోర్డు
- మద్దతు ధరపై నోరెత్తని 'బోర్డు' చైర్మన్
- అన్నదాతలకు మద్దతుగా నిలిచిన రైతుకూలీ సంఘం నాయకులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 18 : పసుపు రైతులు ఆందోళనకు దిగారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డు సిబ్బంది వ్యాపారులకు తొత్తులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. పసుపు సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా మార్కెటింగ్ డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కూడా కొనడం లేదని, దీంతో కొందరు రైతులు దిక్కుతోచక వ్యాపారులు చెప్పిన రేటుకే పసుపు విక్రయించి కన్నీటితో తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నాణ్యత వంకతో నిండాముంచుతున్న వ్యాపారులు

పసుపు నాణ్యత సరిగ్గా లేదని వ్యాపారులు చెబుతున్నారని, ఇదే పసుపును గతంలో అమ్మితే ఎప్పుడూ అడగలేదని, ఇప్పుడే కొత్తగా ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. నాణ్యత లేని పసుపు తెస్తే ప్రధాన గేటు వద్దనే చెక్ చేసి తిరిగి పంపించాలని, ఎందుకు మార్కెట్‌లోకి అనుమతించి, వారం రోజులు గడుస్తున్నా కూడా మార్కెట్ యార్డు కమిటీ ఎందుకు స్పందించట్లేదని నిలదీశారు. అసలే మద్దతు ధర లేక నష్టపోతున్న తమకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని, దానికి తోడు వారం రోజులు మార్కెట్ యార్డులో ఉండడంతో ఖర్చులు అదనపు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీ గదుల్లో కూర్చునే అధికారులకు రైతుల బాధలు పట్టవా అని ప్రశ్నించారు. బయట మార్కెట్‌లో దళారులు మార్కెట్ యార్డు కన్నా మంచి రేటు చెల్లిస్తున్నారని, అయినా కూడా జిల్లాకు పసుపు బోర్డు వచ్చిందని ఆశపడి మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభిస్తుందని ఇక్కడికి వచ్చామన్నారు. కానీ ఇక్కడి వ్యాపారులు నాణ్యత సరిగ్గా లేదన్న వంకతో నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు వ్యాపారులు వచ్చి పసుపును రూ.8వేలు, రూ.9వేల ధరకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు యార్డుకు వచ్చిన పసుపులో కనీసం 60 శాతం కూడా కొనుగోలు చేయలేదని, అలాంటప్పుడు యార్డు గేటుకు తాళం వేసుకోవాలని సూచించారు. పసుపు పండించే రైతులందరం మరోదారి చూసుకుంటామన్నారు.

### పసుపు బోర్డు పేపర్లకే పరిమితం

పసుపు బోర్డు కేవలం పేపర్లలో చూపెట్టడానికి పనికివస్తుందని తప్ప, రైతులకు ఎటువంటి లాభం లేదన్నారు. కేవలం రైతులను మోసం చేసి దగా చేయడానికి పసుపు బోర్డు ప్రకటించారన్నారు. తెగుళ్ల బారిన పడకుండా పసుపును ఏ1, ఏ2గా విభజిస్తే సరిపోతుందని, కానీ పూర్తిగా నాణ్యత లోపం ఉన్నదని పక్కకు పెట్టి, రైతులు దిక్కు తోచక తక్కువ ధరకు విక్రయించి పోయేలా వ్యాపారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పసుపు మద్దతు ధర విషయమై పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని అడిగితే తనకేమీ తెలియదని, మార్కెట్ కమిటీ చైర్మన్‌తో మాట్లాడాలని అంటున్నారని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సంప్రదిస్తే పసుపు బోర్డు చైర్మన్‌తో మాట్లాడుకోవాలని చెబుతున్నారని మండిపడ్డారు. మద్దతు ధర వచ్చే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణ రాగా.. మార్కెట్‌లో పసుపు వారం, పది రోజులు గడుస్తున్నా ఎందుకు కొనట్లేదని, పసుపు నాణ్యత లోపం ఎక్కడుందో చూపించాలని, డైరెక్ట్ పర్చేస్ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని రైతులు ప్రశ్నించారు. డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్‌ను రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని సెక్రటరీ చెప్పడం గమనార్హం. రై తుల ఆందోళన కార్యక్రమం లో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొ న్నారు.

### దిక్కుతోచని స్థితిలో ఉన్నాం..



గత మంగళవారం యా ర్డుకు పసుపు కొమ్మును తీసుకువచ్చా. ఇంతవరకు కొనుగోలుచేయలేదు. నాణ్యత సరిగ్గా లేదని దళారులు రేటు ఇయ్యట్లేదు. వ్యాపారులు కొనట్లేదు. దిక్కుతోచని స్థితిలో ఉంటున్నాం.

-నరేశ్‌రెడ్డి, పడకల్

### నాణ్యత లేదని తిరస్కరిస్తున్నరు..



మార్కెట్ యార్డుకు తెచ్చిన పసుపు నాణ్యత లేదని తిరస్కరిస్తున్నరు. పసుపు కొమ్ముల నాణ్యత సరిగ్గా లేకపోతే ప్రధాన ద్వారం వద్దను చెక్‌చేసి తిరిగి పంపించవచ్చు. లోపలికి వచ్చిన తర్వాత నాణ్యత లేదని చెప్పి కాలయాపన చేస్తున్నరు. పసుపు కొమ్మును తక్కువ రేటుకు అమ్ముకునేలా చేస్తున్నారు.

-సాగర్‌రెడ్డి, నిర్మల్

### ఖర్చులు కూడా రావడంలేదు..



కనీస మద్దతు ధర వస్తుందని ఆశతో మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొస్తే వ్యాపారులు, అధికారులు కలిసి నిండా ముంచుతున్నరు. పెట్టుబడి పైసలు పక్కన పెడితే కనీస ఖర్చులు కూడా రావడం లేదు. ఏం చేయాలో అర్థమైతలేదు.

-ఇందూరు నగేశ్, నిర్మల్

### ధర తగ్గించడానికే కాలయాపన



నాణ్యత సరిగ్గా లేకుంటే ఏదో కొద్దిగా తగ్గించి పసుపు కొనుగోలు చేయవచ్చు. పూర్తిగా కొనుగోలు చేయకుండా పక్కన పెట్టి రైతులే తమంతట తాము ధరలు తగ్గించుకునేలా చేస్తున్నారు.

-శంకర్, మామడ, నిర్మల్ జిల్లా

### పసుపు బోర్డు వచ్చి ఏం లాభం?



పసుపు ధరలు మరీ తగ్గించి రూ. 8వేలు, రూ.9వేలకు వ్యాపారులు కొంటున్నారు. పసుపు బోర్డు వచ్చినా ఏం లాభం లేకుండా పోయింది. చైర్మన్లు, వ్యాపారులు అందరూ కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నరు.

-ఉపేందర్‌రెడ్డి, రెంజర్ల, ముప్కాల్

# నగరంలో 'హిట్ అండ్ రన్'

**ఎస్సైని కారుతో ఢీకొట్టి పరారైన దుండగులు**
**తీవ్ర గాయాలతో దవాఖానలో చేరిన నాల్గోటౌన్ ఎస్సై**
**డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా చోటుచేసుకున్న ఘటన**

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18: డ్రైంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సైను కారులో వచ్చిన దుండగులు ఢీకొట్టి పరారైన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. నాల్గోటౌన్ ఎస్సై-2 ఉదయ్ కుమార్ సిబ్బందితో కలిసి స్థానిక కోటగల్లి హనుమాన్ ఆలయం వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ మిషన్‌తో పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో అటు వైపుగా ఓ కారు రాగా.. నిలపాలని ఎస్సై సూచించారు. కారును నిలపకుండా అందులో ఉన్న దుండగులు మరింత వేగంగా ఎస్సై ఉదయ్ కుమార్‌ను ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యారు. కారు ఢీకొట్టడంతో ఒక్కసారిగా ఎస్సై కింద పడిపోవడంతో ముఖానికి, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను సిబ్బంది చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారుతోపాటు దుండగులను పట్టుకునేందుకు సిబ్బంది ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ ఘటనను పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. అదనపు డీసీపీ బస్వారెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో నగర సీఐ శ్రీనివాస్ రాజ్ ఆధ్వర్యంలో ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ గాలింపు చర్యలు చేపట్టారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న ఎస్సై ఉదయ్

# కవలల హత్యకేసులో తల్లీ కుమారుడికి జీవితఖైదు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలను హతమార్చిన కేసులో నిందితులైన మాక్లూర్ మండలానికి చెందిన తల్లీకొడుకుకు జీవితఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించినట్లు నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాక్లూర్ మండలానికి చెందిన పూన ప్రసాద్, భార్య రమణి, కవలలైన వారి పిల్లలు (చైత్రిక, చైత్రిక్), ఇద్దరు చెల్లెళ్లు శ్రావణి, స్వప్నను ఆస్తికోసం తల్లీ కొడుకులైన మేడిద ప్రశాంత్, మేడిద ఒడ్డెమ్మ హత్యచేశారు. అద్దెకు తెచ్చుకున్న కారులో వారి మృతదేహాలను వివిధ ప్రాంతాల్లో పడేశారు. ఆరుగురిలో కవల పిల్లలైన చైత్రిక, చైత్రిక్ మృతదేహాలను ప్లాస్టిక్ సంచుల్లో మూటకట్టి మెండోరా మండల పరిధిలోని దూదిగాం గ్రామ శివారులో ఉన్న గోదావరి నదిలో పడవేశారు. కవల పిల్లల హత్య ఘటనపై 2023 డిసెంబర్ 4న మెండోరా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్మూర్ రూరల్ సీఐ బి.గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితులు మేడిద ప్రశాంత్, మేడిద ఒడ్డెమ్మ (ప్రశాంత్ తల్లి)కు నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల జీవిత ఖైదు విధించారని అదనపు సీపీ (అడ్మిన్)జి.బస్వారెడ్డి మంగళవారం వెల్లడించారు. మిగతా నాలుగు హత్య కేసులపై విచారణ వివిధ కోర్టుల్లో కొనసాగుతున్నదని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ మహ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్ భూమిని కబ్జా నుంచి విడిపించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

– నిజాంసాగర్, ఫిబ్రవరి 18



# మరోచోట తవ్వకాలకు ఏర్పాట్లు!

### బట్టపూర్ పెద్దవాగు నుంచి ఆగని ఇసుక అక్రమ రవాణా

మోర్తాడ్, ఫిబ్రవరి 18: మండలంలోని బట్టాపూర్ శివారులోని పెద్దవాగులో సోమవారం ఇసుక తవ్వకాలు చేపట్టగా, మెండోరా మండలం వెల్కటూర్ గ్రామకమిటీ ఫిర్యాదు మేరకు నిలిచిపోయాయి. ఈవిషయంపై పోలీసులు రెండు గ్రామాల కమిటీలతో చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే వెల్కటూర్ సరిహద్దు ప్రాంతంలో కాకుండా బట్టాపూర్ వాగులోనే మరోచోట జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి ఇసుకాసురులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇసుక తవ్వకాల కోసం ఇప్పటికే ఒక్కో ట్రాక్టర్‌కు గ్రామకమిటీకి రూ.50వేల చొప్పున 34 ట్రాక్టర్లకు డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. ఇంత పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించిన వారికి గ్రామకమిటీ అడ్డు చెప్పే అవకాశం లేకపోవడంతో వాగులో బుధవారం నుంచి మరోచోట ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు కొనసాగనున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా విషయంలో భారీగా ముడుపులు వచ్చే అవకాశాలు ఉన్నందున పోలీస్, రెవె న్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక దందాను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీస్, రెవెన్యూవ్యవస్థలు అభాసుపాలవుతున్నాయి. జిల్లా అధికారులు కూడా ఇసుక అక్రమ రవాణాను ఎందుకు పట్టించుకోవడంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



స్కేటింగ్ చేస్తున్న యువతి సోనీ చౌరాసియా

# 10,550 కిలోమీటర్ల స్కేటింగ్

### రుద్రూర్, పొతంగల్‌కు చేరుకున్న యువతి సాహస యాత్ర

రుద్రూర్/పొతంగల్, ఫిబ్రవరి 18: కాశీకి చెందిన సోనీ చౌరాసియా అనే యువతి 10,550 కిలోమీటర్ల స్కేటింగ్ యాత్రను ప్రారంభించింది. ఈ యాత్ర మంగళవారం రుద్రూర్, పొతంగల్ మండలాలకు చేరుకున్నది. భారత దేశ ఔన్నత్యాన్ని చాటేందుకు, సనాతన ధర్మ విశిష్టతను వివరించేందుకు ఈ యాత్రను జనవరి 20వ తేదీన ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలువనున్నట్లు పేర్కొన్నారు. బోధన్ వైపు వెళ్తున్న ఆమెను రుద్రూర్, పొతంగల్‌లో స్థానిక నాయకులు సన్మానించారు.